క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ తిరునాళ్లు



పోలేరమ్మకు మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

ఒంగోలు మెట్రో: స్థానిక పేర్నమిట్టలో గ్రామ దేవత పోలేరమ్మ తిరునాళ్లను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం ఉదయం ఏడు గంటలకు పోలేరమ్మ మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి పుష్పాలంకరణ చేశారు. మంగళహారతులతో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం భక్తులు నైవేద్యాలు సమర్పించి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఏడు గంటలకు ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మకు గ్రామోత్సవం నిర్వహించారు.

ఘనంగా వెంకయ్యస్వామి ఆరాధన మహోత్సవాలు



పూజలందుకుంటున్న వెంకయ్యస్వామి

ఒంగోలు మెట్రో: స్థానిక సంతపేటలో భగవాన్ గొలగమూడి వెంకయ్యస్వామి 42వ ఆరాధన మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకుడు ఆవుల బ్రహ్మయ్య తెలిపారు. గురువారం ఉదయం ఆరు గంటల నుంచి శుక్రవారం ఆరు గంటల వరకు చిన్నికృష్ణ బృందంచే స్వామివారి సంకీర్తన ఏకాహం భజన నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు భగవాన్ పెద్దకృష్ణ వారిచే నామ సంకీర్తన జరుగుతుంది. రాత్రి ఏడు గంటలకు పర్వతరావు ఆధ్యాత్మిక ప్రసంగం ఉంటుంది. భక్తులు పాల్గొనాలని బ్రహ్మయ్య కోరారు.

శివాలయానికి విరాళం



విరాళం అందిస్తున్న భానుకుమారి

ఒంగోలు మెట్రో: ఒంగోలు రంగారాయుడు చెరువు వద్ద పునర్నిర్మాణంలో ఉన్న భువనేశ్వరీ పశుపతి ఈశ్వరాలయానికి భానుకుమారి బుధవారం ఉదయం రూ.50,116 విరాళం అందజేశారు. ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి ఉపాధ్యక్షుడు మహంకాళి శేషయ్యకు ఆ మొత్తాన్ని అందించారు. అదేవిధంగా స్థానిక రంగారాయుడు చెరువు దగ్గర ధీరజ్ హాస్పిటల్ ఎదురుగా తోపులో బడి దగ్గర నూతనంగా నిర్మాణంలో ఉన్న ఆబ్దిక భవనానికి భానుకుమారి రూ.50,116 విరాళాన్ని మహంకాళి శేషయ్యకు అందజేశారు. తన భర్త నముడూరి వెంకటరత్న కిరీటి జ్ఞాపకార్థం విరాళం అందించిన భానుకుమారికి ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

రహదారి నిర్మాణ పనుల అడ్డగింత

● పరిహారం చెల్లించి పనులు చేయాలని రైతుల డిమాండ్

పొదిలిరూరల్: జాతీయ రహదారి నిర్మాణ పనులను రైతులు అడ్డుకున్నారు. విజయవాడ నుంచి బెంగళూరు వయా కడప మీదుగా ప్రభుత్వం తలపెట్టిన జాతీయ రహదారిలో పొదిలి మండలంలోని గోగినేనివారిపాలెం, తలమళ్ల, ఉప్పలపాడు గ్రామాల పరిధిలోని దాదాపు 200 ఎకరాలను అధికారులు సేకరించారు. ఏడాది క్రితం నిర్మాణ పనులను కేఎస్ ఆర్ కన్‌స్ట్రక్షన్స్ చేపట్టింది. ఆయా గ్రామాల్లో భూములు కోల్పోయిన రైతులకు మొదటి విడతలో 70 ఎకరాలకు పరిహారం అందించారు. రెండో విడతలో 100 ఎకరాలకు పరిహారం రావాల్సి ఉండగా..ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. దీంతో ఆగ్రహించిన రైతులు మండలంలోని గోగినేవిరాపిలాఎంలో బుధవారం పనులు అడ్డుకున్నారు. రోడ్డు పనులకు మట్టి తరలించే వాహనాలను నిలిపివేసి నిరసనకు దిగారు. దీంతో సంబంధిత యాజమాన్య పర్యవేక్షకులు వచ్చి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.



గోగినేనివారిపాలెంలో రోడ్డుకు అడ్డంగా మట్టి తోలి నిరసన తెలుపుతున్న రైతులు

సాగుపై సందిగ్ధం..!

- ఖరీఫ్ సాగుపై అయోమయంలో అన్నదాత
- వర్షాలు లేకపోవడంతో ఆందోళన
- ప్రభుత్వ ప్రోత్సాహం శూన్యం
- ఒంగోలు వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 38,286 ఎకరాలు
- ఇప్పటి వరకు సాగైంది 9,547 ఎకరాలు
- 24.93 శాతం మాత్రమే పంటల సాగు

ఒకవైపు వర్షాభావం.. మరోవైపు ప్రభుత్వ నిర్లక్ష్యం రైతులను గందరగోళానికి గురిచేస్తున్నాయి. ఖరీఫ్ సాగుపై ముందుకు వెళ్లాలో..లేదో అర్థంగాక అన్నదాతలు అయోమయంలో ఉండిపోయారు. ఆగస్టు నెల కూడా ముగుస్తున్నప్పటికీ ఖరీఫ్ సాధారణ విస్తీర్ణంలో పావు వంతు కూడా పంటలు సాగవలేదు. ఒంగోలు వ్యవసాయ సబ్ డివిజన్‌లో 24.93 శాతం మాత్రమే పంటలు సాగు చేశారు. సరైన వర్షాలు కురవకపోవడంతో పాటు రైతులకు సహాయ సహకారాలు అందించి వ్యవసాయాన్ని ప్రోత్సహించడంలో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం కావడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది.

ఒంగోలు సెంట్రల్:

అసలే పంటల సాగులో పెట్టుబడులు భారీగా పెరిగిపోయాయి. కూటమి ప్రభుత్వం చేయూత ఇచ్చే పరిస్థితులే కనిపించడం లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేకంగా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు మొదలు.. పంట చేతికొచ్చి గిట్టుబాటు ధరకు అమ్ముకునేంత వరకూ అన్నదాతలకు అండగా నిలిచారు. ప్రతి ఏటా జూన్‌లో రైతు భరోసా పథకం ద్వారా నగదు అందించి ఖరీఫ్ పెట్టుబడికి సాయం చేశారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు ఎన్నికల హామీల్లోని సూపర్ సిక్స్‌లో ఏటా రైతుకు రూ.20 వేలు ఇస్తానని చెప్పినప్పటికీ.. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాడనే నమ్మకం రైతులకు లేకుండా పోయింది. అధికారంలోకి వచ్చి రెండు నెలలు దాటినా రైతులకు ఆర్థికసాయం గురించి చంద్రబాబు మాట్లాడకపోవడమే అందుకు నిదర్శనంగా ఉంది. దీంతో భారీగా పెరిగిన పెట్టుబడులను చూసి రైతులు భయపడుతున్నారు. దీనికితోడు రైతుల ఆశలతో వరుణుడు దోబూచులాడుతున్నాడు. ఒంగోలు వ్యవసాయ డివిజన్‌లో ఖరీఫ్ సాగుకు సరిపడా వర్షాలు పడకపోవటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

అరకొరగా సాగుచేసిన పంటలు సైతం ఎండుముఖం...

జూన్ నుంచి సెప్టెంబర్ వరకు ఖరీఫ్ కాలం కాగా, ఇప్పటికే జూన్, జూలై ముగిసి ఆగస్టు నెల కూడా సగం దాటింది. కానీ, సరైన వర్షపాతం నమోదు కాలేదు. దీంతో ఒంగోలు వ్యవసాయ సబ్ డివిజన్‌లో 24.93 శాతం మాత్రమే పంటలు సాగయ్యాయి. డివిజన్‌లో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 38,286 ఎకరాలు కాగా, కేవలం 9,547 ఎకరాల్లోనే రైతులు సాగుచేశారు. అరకొరగా సాగుచేసిన పంటలు సైతం వేడి గాలులు, ఎండ దెబ్బకు బెట్టకు వస్తున్నాయి. నల్లగా మబ్బులు కమ్ముతున్నా..

వర్షాలు మాత్రం కురవడం లేదు. అదిగో అల్పపీడనం, ఇదిగో అల్పపీడనం అంటూ వాతావరణ శాఖ ప్రకటిస్తున్నా.. ఫలితం ఉండటం లేదు. జూన్‌లో సాధారణ వర్షపాతం 57.9 మిల్లీ మీటర్లు కాగా, 83.8 నమోదవడంతో రైతుల్లో ఖరీఫ్ సాగుపై ఆశలు చిగురించాయి. జూలైలో 87.9 మిల్లీమీటర్లు సాధారణ వర్షపాతం కాగా, 82.8 మాత్రమే కురిసింది. 5.8 మిల్లీమీటర్లు తక్కువగా నమోదైంది. ఆగస్టు నెలలో సాధారణ వర్షపాతం 92.4 మిల్లీమీటర్లు కాగా, ఇప్పటి వరకు 4.5 మిల్లీమీటర్లు మాత్రమే కురిసింది.



వర్షం లేక చీమకుర్తి మండలం ఇలపావులూరు వద్ద బెట్టకు వస్తున్న మొక్కజొన్న



మద్దిపాడు మండలం తెల్లపాడు వద్ద దుక్కి దున్ని పంటలు సాగు చేయకుండా వదిలేసిన పొలాలు

వర్షాలు లేక, ప్రభుత్వ ప్రోత్సాహం అందక రైతులు ఖరీఫ్ పంటల సాగుకు ముందుకు రావడం లేదు. కొన్నిచోట్ల పూర్తిస్థాయిలో భూములు పదును కాకపోవడంతో సక్రమంగా దుక్కులు సైతం రావడం లేదని రైతన్నలు ఆవేదన చెందుతున్నారు. మరో గట్టి వర్షం పడి వాగులు ప్రవహించి భూగర్భ జలాలు పెరిగితే గానీ.. వ్యవసాయ పనులు పూర్తి స్థాయిలో ప్రారంభమయ్యే అవకాశాలు లేవు.

అన్నీ ప్రతికూల అంశాలే...

ఈ ఏడాది విత్తనాలు, ఎరువుల ధరలు పెరిగాయి. ప్రభుత్వం రైతు భరోసా సాయం అందించక పెట్టుబడులకు ఏం చెయ్యాలో తెలియని పరిస్థితి నెలకొంది. బ్యాంకర్లు కూడా రుణాల రీ షెడ్యూల్‌పై మక్కువ చూపుతున్నారు. కానీ, కొత్త రుణాల మంజూరులో తీవ్ర జాప్యం చేస్తున్నారు. దీంతో రైతుల వద్ద నగదు లేక, ప్రభుత్వం ఆదుకుంటుందనే భరోసా కనిపించక, ప్రకృతి సహకరిస్తుందనే నమ్మకం కలగక పంటల సాగుకు ధైర్యం చేయడం లేదు.

ఒంగోలు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో పంటల సాగు వివరాలు...

పంట	ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	ప్రస్తుతం సాగైన విస్తీర్ణం (ఎకరాల్లో)
వరి	3857.5	37.5
సజ్జ	975	307.5
జొన్న	147.5	2.5
కొర్ర	100	20
పచ్చ పెసర	287.5	75
మినుము	337.5	2.5
కంది	2852.5	40
వేరుశనగ	1180	741
నువ్వులు	1922.5	3070.77
ఫ్రూట్స్	2195	790
కూరగాయలు	382.5	250
జనుము	332.5	370
పశువుల మేత పంటలు	1565	120
పచ్చిరొట్ట ఎరువులు	675	787.5
ఇతర పంటలు	21,476	2932.73
మొత్తం	38,286	9,547

భక్తిశ్రద్ధలతో విష్వక్సేన ఆరాధన



ప్రాయశ్చిత ఉక్త హోమ క్రతువు నిర్వహిస్తున్న వేద పురోహితులు

ఒంగోలు మెట్రో: ఒంగోలు కొండమీద శ్రీగిరి వేంకటేశ్వరస్వామికి మూడు రోజులుగా జరుగుతున్న పవిత్రోత్సవాలు బుధవారం పూర్ణాహుతితో శాస్త్రోక్తంగా ముగిసాయి. టీటీడీ ఆగమ పండితుడు పరాంకుశం సీతారామాచార్యులు బృందంతో పాటు శ్రీగిరి ఆలయ అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో వైఖానస ఆగమానుసారం పవిత్రోత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పవిత్రోత్సవాలలో భాగంగా శ్రీవారికి సహస్ర నామార్చన, విష్వక్సేన ఆరాధన, కుంభారాధన, సుదర్శనారాధన, సర్వదైవత్య హోమం, సహస్రశీతి మంత్ర హోమం, విశేష స్నపన తిరుమంజనం, కుంభ నివేదనం, సర్వ దైవత్య హోమం, ప్రాయశ్చిత్త హోమం, ఉక్త హోమం, పూర్ణాహుతి, రక్షాబంధన విసర్జన, ఆచార్య శేష వస్త్ర బహుమానం, బ్రహ్మ ఘోష, యజమాన ఆశీర్వచనం కార్యక్రమాలను మూడు రోజులుగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీకుమారి, శ్రీగిరి దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ రాజీవ్, ఆలూరు జై శంకర్ తదితరులు పర్యవేక్షించారు.

ఓటర్ల జాబితా సవరణను విజయవంతం చేయాలి

● ఒంగోలు ఆర్డీఓ సుబ్బారెడ్డి



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్డీఓ సుబ్బారెడ్డి

ఒంగోలు సెంట్రల్: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణను విజయవంతం చేయాలని ఒంగోలు ఆర్డీఓ జీవీ సుబ్బారెడ్డి కోరారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఓటు లేని వారు, 2025 జనవరి ఒకటి నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మారిన వారు ఫాం 8, ఆధార్ అనుసంధానం వంటివాటిని చేయించుకునేందుకు మంగళవారం నుంచి అవకాశం కల్పించినట్లు తెలిపారు. మృతిచెందిన ఓటర్లను కూడా జాబితా నుంచి తొలగించాలని కోరారు. నూతన ఓట్ల నమోదుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. డీటీ కట్టా శ్రీదేవి, వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి రసూల్, బీజేపీ ప్రతినిధి గుర్రం సత్యం, టీడీపీ ప్రతినిధి స్వరూప్, సీపీఐ చౌదరి, సీపీఎం రమేష్, జనసేన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు భోజనం ప్యాకెట్ల పంపిణీ

కొత్తపట్నం: మదర్ థెరిసా హెల్పింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పలువురు పేదలకు బుధవారం భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. కొత్తపట్నంలోని గంగమ్మగుడి ఆవరణలో ఆకలితో అలమటిస్తున్న వృద్ధులు, వికలాంగులు, పిల్లలను గుర్తించి భోజనం ప్యాకెట్లు, కేక్, బిస్కెట్లు, కూల్‌డ్రింక్స్ పంపిణీ చేశారు. అల్లూరు ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు కుమార్తె శరణ్య పుట్టినరోజు సందర్భంగా వాటిని అందజేశారు. కార్యక్రమంలో హెల్పింగ్ ఆర్గనైజేషన్ ఆర్గనైజర్ డి.కేశవ్, ఎం.సునీల్ డి.రజిత, ఎం.రాజ్‌కుమార్, ఎం.సన్నీ, డి.సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలి



నాగులుప్పలపాడులో రోడ్డుపై ధర్నా నిర్వహిస్తున్న మాలమహానాడు నేతలు



చీమకుర్తిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు

● భారత్ బంద్‌లో భాగంగా పలు ప్రాంతాల్లో ధర్నాలు, ర్యాలీలు

కొత్తపట్నం: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని ఎస్సీ నాయకుడు కసుకుర్తి శ్రీను డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన భారత్ బంద్‌లో భాగంగా కొత్తపట్నం మండలం ఈతముక్కల గ్రామంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన అన్యాయమైన తీర్పును తామంతా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఎస్సీలు కలిసిమెలిసి అన్నదమ్ములుగా ఉన్నారని, వారిని విభజించు, పాలించు అనే విధానంతో విడగొట్టి రాజకీయ పబ్బం గడుపుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూస్తున్నాయని ఆరోపించారు. దేశంలో ఉన్న పేద, బడుగు, బలహీనవర్గాల వారిని కుల, మత విధానాలతో అనేక విధాలుగా హింసించడం జరిగిందన్నారు. ఈతముక్కల పాలిటెక్నిక్ కాలేజీ, హైస్కూళ్లు, మండలంలోని స్కూళ్లన్నీ మూసివేయించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గడ్డం ఆంజనేయులు, గడ్డం అమృతపాణి, బత్తల అబి, సత్తా యోహాన్, దోనెంపూడి విగ్నేష్, నత్తల బ్రహ్మయ్య, పూరిమెట్ల చినకోటయ్య, నల్లప ధనుష్‌సాయి, బొమ్మల వేణు, నల్లప శశాంక్ సాయి, గుమ్మళ్ల స్టెఫెన్‌రాజు తదితరుల పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు మండలంలో...

నాగులుప్పలపాడు: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణను తక్షణమే కేంద్ర ప్రభుత్వం నిలుపుదల చేయాలనే డిమాండ్‌తో దేశవ్యాప్తంగా దళిత సంఘాల పిలుపు మేరకు బుధవారం చేపట్టిన భారత్ బంద్ నాగులుప్పలపాడు మండలంలో ప్రశాంతంగా జరిగింది. మాల ఐక్య సంఘాల సూచనల మేరకు వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. పాఠశాలలు కూడా మూసివేశారు. మాలమహానాడు నేతలు బ్యాంకులు, ప్రభుత్వ పాఠశాలల సిబ్బందితో మాట్లాడి బంద్‌కు సహకరించాలని కోరగా, వారు కూడా బంద్‌కు సహకరించడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంతంగా బంద్ జరిగింది. నాగులుప్పలపాడు కూడలిలో మాల జేఏసీ ఆధ్వర్యంలో 216 జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. పోలీసులు నిలువరించి ట్రాఫిక్‌కు ఆటంకం కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ధర్నాలో నాయకులు తెలగతోటి పృథ్వీ, జాన్సన్, దొడ్డ స్టాలిన్, సింగరయ్య, గారపాటి రాజేష్, వజ్రంబాబు, కందుల రాజేష్, దాసు తదితరులు పాల్గొన్నారు.



ఈతముక్కల అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఎస్సీ నాయకులు


రాజ్యాంగానికి వ్యతిరేకం.. సుప్రీంకోర్టు తీర్పు...

చీమకుర్తి: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగానికి వ్యతిరేకమని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ కన్వీనర్ బండ్ల డేవిడ్ అన్నారు. వర్గీకరణ తీర్పును నిరసిస్తూ జాతీయ స్థాయిలో ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం చీమకుర్తిలో నిర్వహించిన భారత్‌బంద్‌లో మాల ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. చీమకుర్తి పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డేవిడ్‌తో పాటు ఆయా సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ రిజర్వేషన్లను ఎత్తివేసే కుట్రలో భాగంగానే ఎస్సీ వర్గీకరణను జాతీయ స్థాయిలో రాజకీయ పార్టీల నాయకులు తెరపైకి తెచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా సంఘాల ప్రతినిధులు చావాబత్తిన బ్రహ్మయ్య, వేమా బాలకోటేశ్వరరావు, బండ్ల కొండలు, మట్టిగుంట రామాంజులు, పిల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామ సభలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

● జిల్లా ఇన్‌చార్జి డీపీఓ ఉషారాణి

మద్దిపాడు: ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో నిర్వహించే పనులకు సంబంధించి ఈ నెల 23వ తేదీ నిర్వహించనున్న గ్రామ సభలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా ఇన్‌చార్జి డీపీఓ ఉషారాణి అధికారులకు సూచించారు. మద్దిపాడు సచివాలయాన్ని బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2023-24 కాలంలో ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ కింద గ్రామాల్లో చేపట్టిన పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయా పనుల పురోగతిపై ఆరా తీశారు. వాటి వలన ప్రజలకు కలిగే ప్రయోజనాలు, తదితర అంశాలపై చర్చించారు. 2024-25 సంవత్సరంలో చేపట్టాల్సిన పనుల గురించి గ్రామ సభల్లో తెలియజేస్తే.. ఆయా పనులు గ్రామాల అభివృద్ధికి పనికొస్తాయా.. లేదా అనే అంశాలపై ప్రజలు స్పందిస్తారని తెలిపారు. గ్రామంలో నిర్వహించాల్సిన పనుల జాబితా తయారు చేసుకోవాలని గ్రామ కార్యదర్శి ఆశాలక్ష్మిని ఇన్‌చార్జి డీపీఓ ఆదేశించారు. ఈ నెల 22వ తేదీ మద్దిపాడు సచివాలయాన్ని పీఆర్ అండ్ ఆర్‌డీ డైరెక్టర్ ఎంవీ ఆర్ కృష్ణతేజ సందర్శిస్తారని, ఆ మేరకు ఏర్పాట్లు చేసుకోవాలని ఈఓపీఆర్‌డీ రఘుబాబుకు సూచించారు. ఆమె వెంట ఎంపీడీఓ కార్యాలయ ఏఓ సుబ్బారావు, గ్రామ సర్పంచ్ మద్దులూరి వెంకటేశ్వర్లు ఉన్నారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఇన్‌చార్జి డీపీఓ ఉషారాణి

డ్వామా పీడీ ఫీల్డ్ విజిట్...

పీఆర్ అండ్ ఆర్‌డీ డైరెక్టర్ ఎంవీఆర్ కృష్ణతేజ ఈ నెల 22వ తేదీ మద్దిపాడును సందర్శించనున్న నేపథ్యంలో డ్వామా పీడీ అర్జునరావు బుధవారం మద్దిపాడు వచ్చి ఫీల్డ్ విజిట్ నిర్వహించారు. ఆయన వెంట ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏపీడీ వెంకటస్వామి, ఏపీఓ ధనంజయవర్మ, ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా జాతీయ వృద్ధుల దినోత్సవం

పొదిలి: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో వాకింగ్ ట్రాక్ వద్ద బుధవారం జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వాకర్స్ అసోసియేషన్, నవ్వుల పువ్వుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ సిటిజన్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు మాచాబత్తుని గోయిందయ్యను ఘనంగా సన్మానించారు. పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి షేక్.మదార్‌వలి మాట్లాడుతూ.. ఎన్నో అనుభవాలను, అనుభూతులను వారసులకు, భవిష్యత్ సమాజానికి పంచే వృద్ధులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు. వృద్ధులకు ప్రభుత్వం వీలైనన్ని రాయితీలు ఇవ్వాలని కోరారు. వృద్ధులతో వ్యవహరించాల్సిన తీరు గురించి కవి పావులూరి మల్లికార్జునరావు వివరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు, సీనియస్ సిటిజన్లు షేక్. బాషామొహిద్దీన్, మూసా జానీ, ముల్లా జిలానీ, ఖాదర్‌బాషా, వెంకట నారాయణ, ముల్లా షుకూర్, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సరఫరాలో లోపాలు సరిదిద్దాలి

ఒంగోలు టౌన్: నగర ప్రజలను పట్టిపీడిస్తున్న మంచినీటి సరఫరాలోని లోపాలను సరిదిద్దాలని సీపీఎం నగర కార్యదర్శి జి.రమేష్ కోరారు. ఒంగోలు నగరంలోని పలు సమస్యలపై బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి దామా శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని ఎస్ఎస్ ట్యాంకులలో ఉన్న నీటి పంపిణీ లోపాల వలన ప్రతిరోజూ ఏదో ఒక చోట సమస్య ఏర్పడుతోందన్నారు. తక్షణమే లోపాలను సరిదిద్ది ప్రజలకు సకాలంలో మంచినీరు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. బైపాస్ రోడ్డు పడమర, బాలాజీనగర్, రాజీవ్ గృహకల్ప దగ్గర శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని కోరారు. శివారు కాలనీల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, పార్కులను అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. సీనియర్ నాయకుడు ఉప్పుటూరి ప్రకాష్‌రావు మాట్లాడుతూ పోతురాజు కాలువ ఆధునీకరణ పనులను వెంటనే చేపట్టాలని కోరారు. నగరంలో ఏ వీధిలో చూసినా కుక్కల బెడద ఎక్కువగా ఉందని, ప్రధాన రహదారుల మీద సంచరిస్తున్న ఆవులను సురక్షిత ప్రాంతాలకు చేర్చాలని చెప్పారు. ఆగ్రహారం గేటు వద్ద రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని, రెండో ఆర్టీసీ డిపో ఏర్పాటు చేసి ప్రయాణికుల సమస్యలు తీర్చాలని విజ్ఞప్తి చేశారు. నగర సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సమావేశంలో తీర్మానం చేశారు. కార్యక్రమంలో పెండ్యాల హనుమంతరావు, ఏవీ పుల్లారావు, మారెళ్ల సుబ్బారావు, జి.నరసింహారావు, భక్తసింగ్‌రాజు, చీకటి శ్రీనివాసరావు, దేవతా శ్రీరాములు, నార్నె వెంకటసుబ్బయ్య, ముసలారెడ్డి, ఉదయభాస్కర్, ఆదిలక్ష్మి, హుసేన్ తదితరులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రసంగిస్తున్న రమేష్

28న మార్కాపురంలో జాబ్‌మేళా

మార్కాపురం: మార్కాపురం సబ్ ఎంప్లాయిమెంట్ కార్యాలయం ఆధ్వర్యంలో ఆగస్టు 28న ఉదయం 10 నుంచి సాయంత్రం 3 గంటల వరకు స్థానిక మెప్మా కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జూనియర్ ఎంప్లాయిమెంట్ అధికారి కేవీ రామాంజనేయులు తెలిపారు. కేఎల్ గ్రూప్, అమెజాన్ రిటైల్ రంగంలో వివిధ విభాగాల్లో ఖాళీలను భర్తీ చేస్తున్నట్లు చెప్పారు. 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న ఐటీఐ, డిప్లమో, ఎస్ఎస్‌సీ, ఇంటర్‌మీడియట్, డిగ్రీ అభ్యర్థులు అర్హులని స్పష్టం చేశారు. ఇంటర్వ్యూకు ఆధార్ కార్డు, సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని సూచించారు.